# లోకాలోకనం

శ్రీ శ్రీ గారి మహాప్రస్థానాన్ని సీరియస్‌గా చదువుతున్నా— ఆ పుస్తకమంటే ప్రాణం— అందుకే రోజుకు రెండు మూడు మార్లయినా చదివిందే చదువుతూ ఆనందిస్తుంటా—

“పాడు ఎలుకలు... ఇంట్లో వీటి గోల రానురానూ ఎక్కువైపోతోంది!... చూడండి... వానిగాడి పుస్తకాలన్నీ ఎలా కొరికేశాయో—

అమ్మ ఎలుకలు కొరికేసిన తమ్ముడి పుస్తకాలన్నీ నాన్నగారికి చూపిస్తోంది. వానిగాడు వాటిని చూస్తూనే ఏడుపు లంకించుకున్నాడు.

*“పతితులారా... భ్రష్టులారా బాధా సర్పదష్టులారా... ఏడవకండేడవకండి”—*

శ్రుతి మించి పోతున్న వానిగాడి ఏడుపు రాగాన్ని శ్రుతిలో పెట్టడానికి అమ్మ వాడ్ని బుజ్జగిస్తూ... హైరానా పడిపోతూ వుంది.

“నువ్వు మరీనూ... ఏడ్చేవాడ్ని కాస్సేపలా వదిలేయ్... కాస్సేపయాక వాడే వూరుకుంటాడు... బుజ్జగిస్తే అలాగే నెత్తికెక్కుతారు...”

*“ఎగిరించకు.. లోహ విహంగాలను...*
*కదిలించకు... సుప్త భుజంగాలను”—*

పేపర్ చూస్తున్న నాన్నగారికి వానిగాడి డిస్ట్రబెన్స్ దుస్సహంగా వుంది. అందుకే ఆ అసహనం—

“నా రాతకొద్దీ... మీతో చెప్పుకున్నా... అంతేలే” అమ్మ నిట్టూర్పు—

*“అంతేలే పేదల గుండెలు... అశ్రువులే నిండిన కుండలు”—*

“ఇంట్లో ఏ తినే వస్తువు వుంచినా వుండనివ్వడం లేదంటే వినిపించుకోరేం... ఇంట్లో ఎక్కడ చూసినా పాడు ఎలుకలే...

*“పట్టణాలలో... పల్లెటూళ్ళలో.. బట్టబయలునా... పర్వత గుహలా.. ప్రపంచమంతా... ప్రతిధ్వనిస్తూ”—*

“అయినా మీతో ఎన్ని రోజుల్నుంచీ మొత్తుకుంటున్నా— పిల్లినోదాన్ని తెండని... వీటితో పడలేక చచ్చిపోతున్నా... ఇవన్నీ మీ తలకెక్కడ ఎక్కుతాయి... అదృష్టవంతులు మీరు...” అమ్మ నిష్ఠూరం—

*“అదృష్టవంతులు మీరు... వెలుగును ప్రేమిస్తారు— ఇరులను ద్వేషిస్తారు”—*

నాన్న యథాలాపంగా పేపర్‌లో తలదూర్చేసి అందులోని అంతర్జాతీయ సమస్యల పరిష్కారం గురించి తీవ్ర ఆలోచనలో మునిగిపోయాడు.

“ఒరేయ్... రాజా... మీ ఫ్రెండ్సెవరి దగ్గరైనా బోనుంటే పట్టారాదూ... ఇవి నా దుంప తెంచుతున్నాయ్—” నాన్నతో వ్యవహారం కాదని నన్ను ఆశ్రయించింది.

*“ఔను... నిజం... ఔను నిజం... నీవన్నది నిజం.. నిజం...”*

అమ్మ పట్టి కుదిపింది—

మరో ఊహా ప్రపంచంలో కవిత అల్లుతున్న నేను తేరుకుని ఏమిటన్నట్టు చూశా—

“ఆ పుస్తకమక్కడ పడేసి... వెళ్ళి మీ ఫ్రెండ్సెవరి దగ్గరైనా బోనుంటే పట్రా...వీటితో నేనింక వేగలేను” అమ్మ ఎలుకల నివారణ జరిగే వరకు విశ్రమించేలా కనబడలేదు— మహాప్రస్థానాన్ని సొరుగులో పడేసి బయల్దేరా— అయినా ఆ మత్తు దిగితేగా!—

*“ఏవో... ఏవేవో... ఘోషలు వినబడుతున్నాయ్—*
*గుండెలు వీడిపోతున్నాయ్”—*

ఈ విశాల ప్రపంచంలో అమాయకంగా తమ మానాన తాము బతుకుతున్న మూగ ప్రాణుల సంహారానికి సంసిద్ధమౌతూ లేచేనే గానీ— ఏ మూలో కాస్త జాలీ, ఇంకాస్త భూతదయ రొదపెడుతూనే వుంది—

నడుస్తున్న నా కాళ్ళ మధ్య ఏదో అడ్డుపడితే... కిందికి చూశా— మా పెంపుడు కుక్కపిల్ల. అమ్మ దాన్నెందుకో ఎప్పుడూ కట్టేసే వుంచుతుంది. అదేమో గింజుకుంటూ... గొలుసుల్ని తెంచుకు ఉరకడానికి ఉత్సాహపడ్తుంటుంది—

*“కుక్కపిల్ల... అగ్గిపుల్లా... సబ్బు బిళ్ళా...*

## (కీ.శే. శ్రీ శ్రీ గారికి క్షమాపణల్తో)

*హీనంగా చూడకు దేన్నీ...*
*కవితామయమేనోయ్ అన్నీ”—*

దాన్ని బంధవిముక్తురాల్ని చేసి వదిలా— అది ఆపుకోలేని సంతోషంతో నా కాళ్ళని నాకి... గంతులేస్తూ... స్వేచ్ఛా ప్రపంచ విహారానికై—

*“సింహము లాగు... శివంగిలాగూ...*
*ఫిరంగిలాగు... కురంగిలాగు”—*

ఆనందోత్సాహంతో పరుగందుకుంది—

సాయంత్రం దాకా ఎక్కిన గడప నీర్సంగా దిగడంతోనే సరిపోయి— పరాజిత యుద్ధ వీరుడిలా ఇంటి ముఖం పట్టా—

ఇప్పుడు నేను కనీసం పిల్లినైనా సంపాదించాలి?— ఆలోచిస్తున్న నాకు హఠాత్తుగా ఓ సత్యం బోధపడింది... ఎలుకల్ని చంపడానికి మార్జాలరాజు అవసరమే... అయితే ఇక్కడ... పిల్లి పెత్తందార్ల పోలికతో... ఎలుక శ్రామిక జన ప్రతినిధిగా గోచరించింది—

పళ్ళు రాలగొట్టుకోవడానికి ఏ రాయి అయినా ఒకటే... కాకపోతే నాకై నేను... సిద్ధాంత చర్చలో బాగా ఆలోచించి... పిల్లిని తీసుకుపోగూడదనే నిర్ణయానికొచ్చేసి... రెండు పాకెట్లు ఎలుకల మందు జేబులో వేసుకుని ఇంటిముఖం పట్టా...

వంటింట్లో మాతృదేవత చేతిలో ఆ రెండు పాకెట్ల నుంచి చేతులు దులుపుకుని... సినిమాకని బయల్దేరా—

ఇంటి గేటు దాటుతుంటే... పక్కింటి విశాలాక్షి పిన్నిగారు... కొడుకు చంటబ్బాయిని చంకనేసుకుని ఎదురుపడింది...

చిరంజీవి చంటబ్బాయి తల్లి చంకలో మూగగా రోదిస్తూ... తనకు తెల్పిన సంగీత పరిజ్ఞానంతో... ఆరోహణ... అవరోహణ క్రమంలో చాలా సిన్సియర్‌గా ఏడుస్తుంటే ముచ్చటేసి నిలబడ్డా—

వెంటనే గాలి దుమారం ప్రారంభమైంది... ఆ దుమారంలో నే వదిలిపెట్టిన కుక్కపిల్లగారు... చంటబ్బాయితో కాసేపు కాలక్షేపించి... ఏమీ తోచక చంటబ్బాయి కాలును కసుక్కున కొరికి... తన దారిన చక్కాపోయింది. దాన్ని కట్టేసుంచక... ఎందుకు వదిలిపెట్టారనే ఆర్గ్యుమెంట్స్‌తో దులపడానికే విశాలాక్షి గారు వచ్చారనే సత్యం క్షణాల్లో బోధపడడంతో... అడుగులు వేగంగా ముందుకేశా...

*“ఒక వ్యక్తిని... ఇంకొక వ్యక్తీ... ఒక జాతిని మరి ఒక జాతి... పీడించే సాంఘిక ధర్మం ఇంకానా? ఇకపై చెల్లదు—!*

నే సినిమా నుండి తిరిగొచ్చేసరికి అమ్మ విషాహారం పంపిణీ కొనసాగించినట్లుంది... దాని తాలూకు వాసన ముక్కుపుటాలకు సోకింది.

వెళ్ళి మంచంపై వాలిపోయా— పాపం ఎలుకలు. ఈ రాత్రితో వాటి బతుకు ఆఖరు...

*“నిప్పులు చిమ్ముకుంటూ నింగికి నేనెగిరిపోతే...*
*నిబిడాశ్చర్యంతో వీరు”—*

పొద్దు లేచేసరికి... వాతావరణ కాలుష్యమేమిటబ్బా... అని ముక్కు మూసుకు ఆలోచించా... ఎలుకల మందు ప్రహసనం జ్ఞప్తికొచ్చి... మంచం మీదే ఎలుకల ఆత్మశాంతికి రెన్నిమిషాలు మౌనం పాటించా—

*“పోతే..పోనీ... సతుల్... సుతుల్ హితుల్—*

నా మౌనాన్ని భగ్నపరుస్తూ... మున్సిపాలిటీవాడి లెవెల్లో వానిగాడు లొక్కుపోతున్నాడు. ఏమిటబ్బా అని... జారిపోతున్న లుంగీని సర్దుకుని కుతూహలంగా చూశా...

అది... మార్జాలరాజుగారి డెడ్ బాడీ... దీని తస్సాదియ్యా- ఇదెలా వచ్చిందబ్బా! వానిగాడ్ని ఆడే అడిగా—

“దీన్ని నాన్నగారు నిన్న పట్టుకొచ్చారు. పాపం రాత్రి అమ్మ వుంచిన ఎలుకల మందు రుచిమాపి చటుంది... దీని గొడవకు ఎలుకలు ఒక్కటే బయటకు రాలేదు... ఇదేమో ఆ మందు తిని చచ్చూరుకుంటే... అవి మాత్రం నిక్షేపంగా వున్నాయ్ అన్నయ్యా...”

నవ్వాలో.. ఏడవాలో.. తెలీని అయోమయ స్థితిలో టేబుల్ సొరుగులాగి... పుస్తకం కోసం చెయ్యి పోనిచ్చా... ఇంకేముంది... తవ్వకాల్లో బయటపడ్డ పురాతన గ్రంథంలా ముప్పాతిక భాగాన్ని కోల్పోయి చేతికొచ్చింది మహాప్రస్థానం—

—ఎం. త్యాగరాజు